# పీడకల

ఒకరోజు సాయంకాలం రాధాక్రిష్ణమూర్తి తన పుస్తకం తీసుకొచ్చి యిచ్చి పరిచయం రాసిపెట్టండి అని అడిగాడు సరే అన్నాను. ఆ రాత్రే పుస్తకం చదివాను.

ఏ విషయాన్ని గూర్చి అయినాసరే రాధాకృష్ణమూర్తి చక్కగా చెప్పగలడు. భావాన్ని వెలిబుచ్చటానికి భాషని సవ్యంగా వాడుకోగలడు. చెప్పవలసింది లేందే కలం పట్టుకోడు. చెప్పదలచిందేమో సూటిగా చెప్తాడు.

సాధారణంగా మన రచయితలు చెప్ప వలసింది లేక పోవటంవల్లో, తాము చెప్పదలచింది లోకులకు తెలపకుండా ఉండటం మంచిదనో—మొత్తానికి ఏ కారణం వల్లయితేనేం తమ బండారం బయట పడకుండా చేసుకోవటానికగాను పులుముడూ తోముడుతో పుస్తకాలు నింపుతున్నారు. భావ దారిద్ర్యంతోపాటు, భాషాస్వరూపం కూడా తెలియనివాళ్ళు ఎక్కువ అవటంవల్ల పెద్ద పెద్ద సమాసాలు, పెద్ద పెద్ద మాటలూ గుప్పి పుస్తకాలను గజిబిజి చేస్తున్నారు. పైగా ఇదే భాష అనుకుంటున్నారు. ఉదాహరణకు చెబుతాను.

భాషా ప్రయోజనం తెలిసినవాడూ, ఆ ప్రయోజనాన్ని సాధించటానికి భాషను లొంగతీసుకొన్నవాడూ ఇలా రాశాడు— "నాకు ఊహ వచ్చినప్పటినుంచీ నేనింతే!" ఈ భావాన్నే తెలుగు మర్యాదలు తెలియనివాడూ, భాషా స్వరూపాన్ని అర్థం చేసుకోలేనివాడూ, మరేం చేస్తాడో చూడండి. ఇతనికి 'ఊహ' అనే మాటరాదు.

అందుకని యీ భావం రాయటానికి ఇలా రాస్తాడు.... 'వయస్సున నేను చిన్ననైనప్పుడు, అనగా నేను జలిబిలి పలుకులు పలుకునపుడు....' అంటాడు.... తెలుగు సంస్కారం రాక, తెలుగు భాషను అవగాహన చేసుకోలేక తాను ఇన్ని తంటాలు పడి, చదివేవాళ్ళని భీతి కుదుపుతాడు. పైగా భాషంటే ఇలాగే ఉండాలని చెబుతాడు. అంతేగాని సరైనమాట దొరక్కపోవటంవల్ల ఇన్నివాక్యాలూ, ఇంత పదజాలం గుప్పవలసి వచ్చిందని ఆలోచించుకోడు.

రాధాకృష్ణమూర్తికి ఈ జబ్బులేదు. డోలుకొడుతూ "ఆడవె ఆడవె అన్నులమిన్నా" అని పాడుతూ భాషతో దొమ్మరి మొగ్గలు వేయించడు. గారడీవాడికిమల్లే భాష అనే బుట్టలో భావం అనే ఆడదాన్ని పెట్టినట్లు పెట్టి, కను కట్టు కట్టి ఖాళీ బుట్టను బోర్లించి చూపి, ప్రేక్షక లోకాన్ని 'తాళీ బజావ్‌లు' కోరడు.

రాధాకృష్ణమూర్తి సంగతి నాకు ఇదివరకే తెలుసు. ఈ పుస్తకం కూడా నా పాత అభిప్రాయాన్ని బలపరచిందే కాని, తబ్బిబ్బు చెయ్య లేదు. అతడిచ్చిన పుస్తకం చదవటం పూర్తిచేసి, అందులో అతడు వెలిబుచ్చిన భావాలను సమన్వయం చేసుకుంటూ పడుకున్నాను. ఒక్కసారి మన రాజకీయాలూ, అంతర్జాతీయ రాజకీయాలూ బొమ్మలు బొమ్మలుగా కళ్ళముందు ఆడినై. మన దేశంలోని రాజకీయ పార్టీలన్నీ ఒకదాని తర్వాత మరొకటి తెరమీదకెక్కి తైతక్కలాడినై. అలాగే ఆలోచించు కుంటూ వొత్తిగిల్లాను. కన్ను మూశాను....

అదొక పెద్ద మీటింగు. జనం కిటకిటలాడుతూ ఉంది. ప్రేక్షక వర్గంలో నేనూ కూర్చున్నాను. ఎందుకో తెలియదుగాని భయం భయంగా ఒక మూల నక్కి కూర్చున్నాను. మిగిలిన వాళ్ళంతా అంత ఉత్సాహంగా ఉన్నప్పుడు, నేనింత భయపెట్టాటానికి కారణం ఏమిటో నాకు తెలవటం లేదు.

అకస్మాత్తుగా, సినిమాలో బొమ్మలాగా, పార్కులో పైకి లేచే

జలధారలాగా రాధాక్రిష్ణమూర్తి వేదిక ఎక్కాడు. వేదిక చుట్టూ కొంకి కర్రలువారు, తలపాగాలవారు సుఖాసీనులై ఉన్నారు. రాధాక్రిష్ణమూర్తి నెమ్మదిగా చిన్న చిన్న వాక్యాలతో మాట్లాటం మొదలుపెట్టాడు.

"కామ్రేడ్స్,

"ఇవ్వాళ మీరిక్కడికి ఎందుకు వచ్చారు? నా వుపన్యాసం విని ఏమన్నా నేర్చుకోవాలనా? లేక హరికథ వింటానికీ, తోలుబొమ్మలు చూట్టానికీ వచ్చినట్లు కాలక్షేపానికి వచ్చారా?"

"వింటానికే వొచ్చాం....వింటానికే వొచ్చాం" అని సభికుల్లో నుంచి కేకలు. ఆ కేకలు సంతోషంతో వేసినవే అయినప్పటికీ నావొళ్ళు జలదరించింది.

"అయితే శ్రద్ధగా వినండి" అని ప్రారంభించాడు రాధాక్రిష్ణమూర్తి. "మనస్సు దగ్గర పెట్టుకొని వినండి. మన దేశం గుడ్డుకుడిసిపోతో ఉంది. మీకేమో యీసంగతి తెలవటంలేదు. ఆర్యులకూ, రాజపుత్రులకూ, మహమ్మదీయులకూ దేశాన్ని అప్పగించిన జాతే ఇప్పుడు మళ్ళీ జపాన్‌కినైవేద్యం పెడుతూవుంది. మీరేమో పట్టీపట్టనట్టు వుంటున్నారు. దేశం పాడవ్వటం అంటే మీరు పాడవ్వటమే! మీరు మీనమేషాలు లెక్కపెట్టుకుంటూ కూర్చొని పెద్దకాపు దేశాన్ని కాపాడి మిమ్మల్ని రక్షిస్తాడని అనుకుంటున్నారు. ఇది పొరపాటు. కేవలం పొరపాటు. మిమ్మల్ని మీరేరక్షించుకోవాలి. జపాన్‌గానీ, జర్మనీగాని రావటంవల్ల ఎవ్వరికి నష్టమోవాడు ఎదురు తిరగాలి గాని, ఫాసిజంవల్ల లాభం పొందేవారిని నమ్ముకూర్చోకూడదు...."

సభికుల్లో రాధాక్రిష్ణమూర్తి మాటలు వుత్సాహాన్ని కలిగించలేదు. మొదటిలో అసలు అర్థమే కాలేదు. ఒకరి మొహాలు ఒకరు చూచుకుంటూ కూర్చున్నారు. ఒక పెద్ద మనిషి నేలమీద చెయ్యి ఆన్చి ఊతం తీసుకొని లేచిచేతులు ఊపుకుంటూ ఇలా చెప్పాడు. "మరేమీ

పనివాలేదులే! నువ్వేమీ చెప్పనక్కర్లేదులే! అన్నిటికీ కాంగ్రెస్సే వుందిలే! గాంధీమహాత్ముడే వున్నాడులే!"

"అదే పొరపాటు. కాంగ్రెస్ మీకెందుకు చేస్తుంది? కాంగ్రెస్ సంస్థ మిమ్మల్ని ఎప్పుడో విడిచి పెట్టింది. మీ హక్కుల్ని రక్షించటానికి కాంగ్రెస్ ప్రయత్నించటం లేదు!

"మీరు చెప్పింది బలే బాగుంది! బూట్ దిరేట్. బూట్ దిరేట్" అని నాలుగు రయిదుగురు లేచి కేకలువేశారు.

నా గుండె జారిపోయింది. ఈ కేకలు ఫిరంగి గుళ్ళుగా తగిలినై. కూటసుడు గిజగిజలాడాడు ఆ భానుడు జలాకాశంలోను చంద్రుడులాగా తొణికాడు ... వీళ్ళు నన్ను చూస్తే?

రాధాకృష్ణమూర్తి మాత్రం తొణక్కుండా నిలబడి చెయ్యి పైకెత్తి బల్ల గుద్ది మాట్లాడుతున్నాడు– "చెపుతాను. ఇవన్నీ చెప్పటానికే నేనిక్కడికి వొచ్చాను. మనదేశంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్గాలున్నాయి...."

"రాట్, నువ్వు కులతత్వం మాట్లాడు తున్నావ్! సోదరులారా, చూశారా? సోషలిజం పేరుతో ఈ వ్యక్తి– ఈ నాలుగు అడుగులు పది అంగుళాలవ్యక్తి .... ఈ.... ఈ రాధాకృష్ణమూర్తి నామధేయుడు– మీకు కులతత్వం బోధిస్తున్నాడు. చూశారా? తిలకించారా? గమనించారా?

ఆ మాట్లాడేమనిషి, చీకటిలో నాకు కనపడకపోయినా అతని మొహాన విభూదిరేఖలు ఉంటాయనీ, మెడలో రుద్రాక్ష మాలలు ఉంటాయని నేను తెలుసుకున్నాను. ఇతని మాటలువిని జనం, "ఈరోజుల్లో కులతత్వమా?" అని గుసగుసలాడింది.

"ఇది కులతత్వం కాదు– మార్క్సిజం. ఇప్పుడు మనదేశ పరిస్థితులు, మార్క్సు పుట్టినప్పటి యూరప్ పరిస్థితులకంటే వెనుకబడి వున్నవి కాబట్టి మన దేశంలో, మార్క్సిజాన్ని, మార్క్సు కాలానికి వెనుక

వర్తింపచేసుకోవలసి వచ్చింది. ఆ పని మేం చేస్తున్నాం. మనదేశంలో ఉన్న బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రకులాల్లాగే ఇతర దేశాల్లో పరిశ్రమ వృద్ధి చెందిన దేశాల్లో పూజారి, జమీందారి, కేపిటలిస్టు, ప్రొలిటేరియస్ వర్గాలంటున్నారు. మన దేశంలో పూర్వం విశ్వామిత్రుడు చేసిన విప్లవమూ, వసిష్ఠుడు చేసిన ప్రతిఘటనా, పరశురాముడు చేసిన విప్లవ నాశనం, బుద్ధుడుచేసిన విప్లవం, శంకరాచర్యులు వర్ణాశ్రమ ధర్మాల పేరుతో జరిగిన విప్లవం నాశనం అన్నీ అప్పటికి మనసంఘంలో ఉన్న వర్గ కలహం ఫలితాలు! కాని మతంపేరు మీదగా జరగటంవల్ల ఈ సత్యాన్ని, ఈ ఉద్యమాల యథార్థ స్వరూపాల్ని మీరు గ్రహించలేకుండా వున్నారు. అనాదినుంచి మనదేశంలో కూడా వర్గకలహం జరుగుతూనేవుంది. కాని విప్లవ శక్తులు ఎప్పటి కప్పుడు నాశనం అయిపోవటంవల్లా, తరువాత వచ్చే వర్గాల నాయకత్వాన్ని, ఎప్పటికప్పుడు మొదటి వర్గమే సొంతం చేసు కొని, తప్పుదార్లను పట్టించటంవల్లా ఇప్పటికీ వర్గం వాసన గవులే అవ్వాళ్టి [illegible] మన సంఘాన్ని వదల్లేదు.

బ్రహ్మర్షి అనిపించుకునే హక్కు మాకూ ఉందనీ, అగ్రజాతికి ప్రత్యేక హక్కు ఉండగూడదనీ చెప్పి విశ్వామిత్రుడు క్షత్రియులను కూడ గట్టుకొని విప్లవం చేయించాడు. ఈ విప్లవమే విశ్వామిత్ర వసిష్ఠుల మధ్య జరిగిన పోరాటంగా మన పురాణాలు వర్ణించాయి. వసిష్ఠుడు ఎలుకైతే విశ్వామిత్రుడు పిల్లిఅయి వెంటపడ్డాడు. వసిష్ఠుడు పిల్లి అయితే విశ్వామిత్రుడు కుక్కయి వెంటపడ్డాడు. వసిష్ఠుడు కుక్కయితే విశ్వామిత్రుడు దుడ్డుకర్రయి వెంటపడ్డాడు

విశ్వామిత్రునివల్ల తయారైన రాములవారికిక్కూడా ఈ గతే పట్టింది. అతడు క్షత్రియ పక్షపాతి అవటం వల్ల వసిష్ఠులవారు అతన్ని అరణ్యాల పాలుచేసి తమ కృష్ణాజనమైన భరతునికి పట్టం కట్టారు. తమకు విరోధి అయిన జనక మహారాజు కూతుర్ని పెళ్ళి చేసుకోవడమే దీనికి ముఖ్య కారణం.

ఇటువంటి రాములవారుకూడా చివ్వరికి అగ్రజాతికి దాసుడై మాటి

మాటికీ సీతామహాదేవి ఆర్యఋషులు చెప్పినప్పుడల్లా వొదిలిపెడితేనేగాని బతకలేకపోయాడు. ఈ ఆత్మ వంచనకు ఫలితంగా చచ్చిపోయిం తర్వాత మాత్రం దేవు డయ్యాడు.

కనక, వర్గకలహం అనాదినుంచీ జరుగుతూనే వుంది. ఈ వర్గాల్లో ఒక వర్గానికి పిడికెడు లాభం కలగటం అంటే మరో వర్గానికి వాటెడు నష్టం అయినప్పుడు వర్గ సామరస్యం ఎట్లా కుదురుతుంది....”

“హృదయం పరివర్తన కలిగితే ఎందుకు కుదరదు? మహా చక్కగా కుదురుతుంది. నువ్వు ధనిక వర్గానికి చెందిన వాడవయినా, హృదయ పరివర్తన కలిగి శ్రామికవర్గానికి లాభం కలిగించే సోషలిజం ప్రచారం చెయ్యటంలా” అన్నాడొకడు సభికుల్లోనుంచి. ఒకడు ఈలవేశాడు. ఒకడు ఏర్ ప్లేన్ మోతచేశాడు. రైల్లో అడుక్కునే బిచ్చగాడికిమల్లే ఒకడు పొట్టమీద మద్దెల దరువు వేస్తున్నాడు.

“ఇంకా మీకు హృదయ పరివర్తనంమీద మోజు పోలేదా—?” అని ప్రశ్నలతో మొదలుపెట్టాడు. రాధాక్రిష్ణమూర్తి “మనదేశ చరిత్రలో ఎన్నో ఉద్యమాలు హృదయ పరివర్తనాన్ని నమ్మి విఫలమైనై. బుద్ధుని సంగతే తీసుకొందాం బుద్ధుడు పై వర్గాల్లో కలిగించటానికి ప్రయత్నించిన హృదయ పరివర్తన శంకరాచార్యుల్ని రాకుండా చేసిందా! బుద్ధుని భూతదయ మన దేశంలో ఇప్పుడేమయింది? ఏసుక్రీస్తు మతం క్రైస్తవులను సామ్రాజ్యాలను సంపాదించి ప్రజలను దోచుకోకుండా ఏమాత్రం ఆపగలిగింది? మీరు చెప్పే హృదయ పరివర్తనం కలగటానికి వీలున్నమాట నిజమే! పైవర్గాలకు చెందినవాళ్ళు కొద్దిమంది దిగువ వర్గాల శ్రేయస్సుకై పాటుపడే మాట నిజమే! వ్యక్తులు కొద్దిమంది మారటంవల్ల అధికారవర్గానికి ఎక్కువ నష్టం లేదు గనకా, అధికారం పూడదు గనకా చూస్తూ ఊరుకుంటారు. కాని వీరి సంఖ్యఎక్కువ అవుతున్నకొద్దీ అధికారవర్గం జాగ్రత్తఎక్కువ అవుతున్నది. చివరికి తమ అధికారానికి భంగం కలిగించే శక్తి వీరికి వచ్చిందని భయం కలిగినప్పుడు దౌర్జన్యయుతంగా వీళ్ళని అణగదొక్కుతారు. అప్పటివరకూ

దౌర్జన్యం చెయ్యవలసిన అవసరం లేదు గనక, చూస్తూచూడనట్లు ఊరు కోవటం, కొద్దో గొప్పో వాళ్ళకు సహాయం చేస్తూ ఉన్నట్టు నటించటం, అహింసనీ భూతదయనీ బోధనచెయ్యటం, జరుగుతూ ఉంటుంది. కనక సంఘం అభివృద్ధి చెందాలంటే, వర్గ పోరాటంతో దిగువవర్గాలు అధికారం స్వాధీనం చేసుకోవటం కంటే గత్యంతరంలేదు. విప్లవం కంటే శరణ్యం లేదు."

"అయితే...." అని ఒకడు సభలోనుంచి లేచాడు. అతడు కళ్ళ జోడుపెట్టి మఫ్లర్ మెడకు చుట్టిఉన్నాడు.

"నువ్వు అడగదలచింది నాకు తెలుసు నువ్వడక్కుండానే జవాబు చెపుతాను. విప్లవంలేకుండా సంఘంలో మార్పు తేలేమా? ప్రపంచంలో ఎక్కడా రాలేదా? అని నీ అనుమానం. తేలేము. రాదు. విప్లవం లేకుండా మార్పు వచ్చినట్లు నీకు భ్రమ కలగటానికి కారణం చెపుతాను విను.

"సీసాలో ఉన్న నీళ్ళకు క్రమక్రమేణా వేడి ఎక్కువ అవుతూ వుంటుంది. నీళ్ళు తుకతుకలాడి పోతో ఉంటై, సీసాలో నుంచి బయట పట్టానికి బిరడా ఉంటం మూలాన వీలుండదు. ఆ బిరడాను తన్ని వెయ్యటం కంటే ఆనీళ్ళకు గత్యంతరం ఉండదు. బిరడా గట్టిగా ఉంటే ఉప్పున ఎగిరిపోతుంది. వొదులుగా వుంటే ఊరికే ఊడిపోతుంది. ఊడనంత బిగువుగావుంటే సీసాయే బ్రద్దలై పోతుంది. విప్లవమూ అంతే! అధికార వర్గం బలహీనంగా ఉన్నచోట విప్లవంనిశ్శబ్దంగా జరిగినట్లు కనిపిస్తుంది. కొద్దిగా బలంగావున్నచోట కొంచెం మోత వినిపిస్తుంది. మరీ బలంగా వున్నచోట సంక్షుభం బ్రహ్మాండమైన మోతతో బద్దలవుతుంది. అధికార వర్గం బలహీనంగా వుండి విప్లవం నిశ్శబ్దంగా జరిగినచోట, హృదయ పరి వర్తనంవల్ల జరిగిందని నువ్వు అనుకుంటున్నావు ఇది కేవలం పొర పాటు...."

రాధాకృష్ణమూర్తి ఇంతవరకు చెప్పేటప్పటికి సభికుల్లో "జమేదా" "బహుబాగా చెప్పాడురా" 'ఉన్నది వున్నట్టు చెప్పాడ్రా' అని గుసగుసలు

బయలుదేరినై. వాతావరణం అనుకూలంగా మారుతూ వుందని గ్రహించి రాధాకృష్ణమూర్తి గొంతుసవరించుకుని బిగ్గరగా ఉద్రేక పూరితంగా మాట్లాటం మొదలుపెట్టాడు మూలనక్కి గుడ్లు వప్పజెప్పి చూస్తూవున్న నాకు కొంచెం భయం తగ్గింది.

"జాతీవాదం ఇట్లాంటి సిద్ధాంతాలమీద ఆధారపడి ఉండబడే ప్రజలకు సహాయం చెయ్యదు. ఒక దశవరకూ జాతీయవాదం విప్లవ పూరితంగా వుంటుందనేమాట నిజమే. 'నా దేశం' అనే అహంకారం మొదటలో దేశానికి కొంతలాభాన్ని చేకుర్చుతుందనేమాటా నిజమె! ధర్మసిద్ధాంతాన్ని ఆధారంచేసుకుని, దేవునిమీద భారంవేసి, బతుకు వెళ్ళబోసుకునే ప్రజల్లో, ఒక లౌకిక ఆదర్శాన్నీ, తీవ్రవాంఛని కలిగించి వాళ్ళ దృష్టిని సంఘంవైపుకి తిప్పుతుంది కాని లాభంవొచ్చే సమయం వచ్చేటప్పటికి వుద్యమాన్ని నడిపే నాయకత్వం, ఇతర వర్గాలను మోసంచేసో, అణగదొక్కో తానే అధికారంలో వుండేటట్టు, తన వర్గానికే లాభాలు వొచ్చేటట్టు చేసుకుంటుంది. ఈనాడు జాతీయ వాదానిక్కూడా ఈగతే పట్టింది. పైగా పరదేశం ముంగిటిలో కాచుకొని వుంటంవల్ల ఈ ఆపద మరీ హెచ్చింది. బేషరాగ్గా వినండి.

"ఇప్పుడు ప్రపంచం రెండు ముఠాలుగా చీలి యుద్ధంచేస్తూ వుంది — ఒకపక్క ఫాసిజం, ఒకపక్క ప్రజాస్వామికాలు. ప్రతిదేశంలోనూ యీ విధంగానే జరుగుతూ వుంది. ప్రతిదేశంలో అగ్రజాతులు ఫాసిజానికి సహాయం చేస్తున్నవి. ఫాసిజం జయించకపోతే తాము అనుభవిస్తున్న నిరంకుశాధికారం పోతుందని వాటికి తెలుసు. అటువంటప్పుడు ప్రతిదేశంలో వున్న దిగువ వర్గాలు ప్రజాస్వామికాలకు యెందుకు సహాయం చెయ్యవు? అలా చెయ్యక, ఫాసిజాన్ని గెలిపిస్తే తమగతి యేమవుతుంది? ప్రజస్వామికంవల్ల దిగువ.వర్గాలకు లాభం గనుక, ఈ వర్గాలన్నీ యే దేశంలో వున్నసరే ప్రజాస్వామికాలకు తమ ఆత్మరక్షణకోసం సహాయం తీరవలసిందే!—"

ఒక కుర్రవాడు చివాలునలేచి, "అయితే యిప్పుడు ఇంగ్లండుకి సహాయం చెయ్యమంటావా యేమిటి?" అని అడిగాడు.

"అదయ్యా అసలురహస్యం. ఈయన్ని జస్టిస్ పార్టీ. ఇన్నిమాటలు చెప్పిందీ ఎందుకయ్యా" అని సభికులకు అపీల్ చేశాడు, "ఛీ," "తూత్!" "ఓరి వీడి సిగదరగా" అని గోలచేసింది జనం. మళ్ళీ నాకు భయం ఎక్కువైంది.

రాధాకృష్ణమూర్తి మాత్రం తొణకలేదు. కట్టెలాగా నిలబడి ఉపన్యసిస్తూనే వున్నాడు. "అవును నేను యింగ్లండుకి సహాయం చెయ్యమనే చెప్తున్నాను. అలా సహాయం చెయ్యటం ప్రజలకు లాభం గనుక చెయ్యమంటున్నాను. దాస్యంలో ఉండటానిక్కాదు. యుద్ధానంతరం ఇంగ్లండు మనల్ని దోచుకునే స్థితిలో వుండదు. అప్పటికి దిగువవర్గాలు రాజకీయంగా పటుకుబడిలోకి రాలేకపోతే పైవర్గానికి చెందిన జాతీయవాదులు అధికారంలోకి వస్తే, వంబరేగుతుంది జాగ్రత్త. కనక ఇంగ్లండువున్నా లేకపోయినా మనకు జాతీయ నిరంకుశత్వం తప్పదు. ఇది తప్పించుకొని మనకు లాభం కలగాలంటే యిదేదారి."

"అయితే స్వరాజ్యం నీకు అక్కర్లేదా?" అని మఫ్లర్ కుర్రవాడు ప్రశ్నించాడు. అతని వాలకంచూస్తే నా గుండె గుభేలుమన్నది.

రాధాక్రిష్ణమూర్తి కొంచెంసేపు ఆలోచించాడు. ఒక్కక్షణం ఆగి ఇలా అడిగాడు—"ముందు నీకే సిద్ధాంతం నచ్చుతుందో చెప్పితే నీ ప్రశ్నకు జవాబు చెపుతాను...."

"నేను సోషలిస్టుని. సోషలిజం నా ఆదర్శం."

"అయితే విను. నువ్వు స్వరాజ్యం కావాలని ఎందుకు కోరుకుంటున్నావ్? స్వరాజ్యం అంటే సోషలిజమనా? కాదు. కాని స్వరాజ్యం రావటం వల్ల సోషలిజం తెచ్చుకోటానికి తగ్గ వాతావరణం కలుగుతుంది గనకే కదా? అంటే ప్రజాస్వామికం రాగానే పరిశ్రమలు వృద్ధిచెందుతవి గనకా, పరిశ్రమలు వృద్ధిచెందటంవల్ల ప్రొలిటేరియట్ యేర్పడుతుంది గనకా, అప్పుడు సోషలిజం తెచ్చుకోవచ్చు గనకా, ఇప్పుడు యుద్ధ పరిశ్రమలవల్ల యే పరిశ్రమలకోసం నువ్వు స్వరాజ్యం కావాలంటు

న్నావో, ఆ పరిశ్రమలను మనదేశంలో ఇంగ్లండే వృద్ధిచేస్తూ ఉందనుకో, అప్పుడేం జేస్తావు! నాయకత్వమూ అధికారమూ ఫాసిజానికి సానుభూతి చూపే జాతీయవాదుల చేతుల్లోకిపోకుండా మాసుకోవాలి. యుద్ధానంతరం ఇంగ్లండు ఎలాగూ మనమీద పెత్తనంచేసే స్థితిలో వుండదు గనక అధికారం ఫాసిస్టు సానుభూతిపరుల చేతుల్లోపడకుండా చూచుకుంటే సోషలిజం తేలిగ్గా సాధించవచ్చు....అవునా?"

యీ విధంగా రాధాకృష్ణమూర్తి మరొక గంటసేపు మాట్లాడాడు. యెందుకనోగాని అతడు మాట్లాడిన మాటలు నాకు వినపడలేదు. చేతులు తిప్పటం, పెదవులు కదల్చటం మాత్రమే మూలనక్కవున్న నాకు కనిపించినై. సభికులకు మాత్రం క్రమ క్రమేణా అతనిమీద మనస్సవటం మాత్రం నేను ఆకట్టాను. "ఆయనచెప్పింది యుక్తియుక్తంగా వుందిరా" "ఆలోచిస్తే నిజమే అనిపిస్తుందిరా?" అనుకుంటున్నారు. ఈ మాటలు సహించలేక ఒక కుర్రవాడులేచి "అతడు రాయిస్టు" "అతడు రాయిస్టు" "మాసిక వేస్తున్నాడు" అని కేకలువేశాడు.

జనమంతా ఒక్కసారి నివ్వెరపోయింది. "రాయిస్టా, ఓరి వీడి...." "వీళ్ళు మసిపూసి మారేడుకాయచేస్తారా?" "వీళ్ళతో మాట్లాడగూడదురా" "స్,లెండి" "పోదాం రండి" అని గోల బయలుదేరింది. ఖాళీ డబ్బాల గలగల మోతకంటే పెద్ద మోత బయలుదేరింది....

ఈ మోతకు నేను నిద్రలోంచి ఉలిక్కిపడి లేచాను. దీపం ఆరిపోయింది. అంతా చీకటిగావుంది. రాధాకృష్ణమూర్తి ప్రూఫ్ కాపీ కోసం అటూ యిటూ తారట్లాడాను, కాని అది కనిపించలేదు.